# సర్వజన హితమే భారతీయ సంస్కృతి

**చాతకము కోరు నేవేళ చంద్రకాంతి**
**తుమ్మెదాశించు పువ్వుల చెమ్మ చేర**
**రోగి కాక్షించు నిత్యము రుచుల మందు**
**పర్తివాసుడు వాంఛించు భక్తజనుల**

ప్రేమస్వరూపులైన విద్యార్థులారా, ఆధ్యాపకులారా!

ఒక్కొక్క మానవునియందు స్థూలము, సూక్ష్మము, కారణము అనే మూడు దేహములున్నవి. పవిత్రమైన ఆహారముతో స్థూలదేహమును, పవిత్రమైన కోరికలచేత సూక్ష్మ శరీరమైన మనస్సును, పవిత్రమైన తలంపులచేత కారణదేహమైన అంతః కరణమును పవిత్రము గావించినప్పుడు అంతరాత్మ అనెడి దైవత్వమును వ్యక్తము చేసుకోటము సాధ్యమవుతుంది. అప్పుడే మానవుడు పరిపూర్ణుడు కాగలడు. ప్రతి యువతి, యువకుడు వ్యక్తిత్వముకోసమని నైతిక విద్యను తప్పనిసరిగా అభ్యసించవలెను. మానవత్వమునందు వున్న దివ్యత్వమును గుర్తించటము మానవుని ప్రధాన ధర్మము. వ్యక్తిత్వమును ప్రకటన చేయుటము ప్రధానమైన విధి. ప్రాచీనకాలమునందు విద్యార్థులు విద్యాదేవతయైన సరస్వతిని సత్ప్రవర్తన, సత్యము మరియు సౌందర్యమును అనుగ్రహించమని ప్రార్థించెడివారు. సత్యము, సత్ప్రవర్తన యెచ్చట వుండునో అక్కడే సహజమైన సౌందర్యము పుట్టిపడుతుంది. వివేకము, యింద్రియనిగ్రహము, ఒక నియమితమైన శిక్షణ మానవుని ప్రధానమైన లక్షణములు.

**నీతి మానవుని పవిత్రమైన, ఉన్నతమైన స్థానమునకు కొనిపోయే రాజమార్గము**

జీవితయాత్రలో సత్ ప్రవర్తన నిమిత్తమై మానవుడు కొన్ని నియమములను

sri sathyasaivachanamrutam

ఎన్నుకుంటూవుంటాడు. వీటినే నైతిక నిబంధనలు అని చెప్పవచ్చును. నైతికమనగా పవిత్రము అనికూడను చెప్పవచ్చు. 'నిత' అనే సంస్కృత శబ్దమునుండి 'నీతి' అనే శబ్దము యేర్పడింది. అనగా క్రమమైన, మంచియైన ప్రవర్తన అని దీని అర్థము. క్రమముతోకూడిన మంచి ప్రవర్తనే నీతియొక్క అంతరార్థము. నీతి మానవుని పవిత్రమైన, వున్నతమైన స్థానమునకు కొనిపోయే రాజమార్గము. సమాజమునందు, రాజ్యమునందు, వ్యక్తియందు నీతి యేనాడు నశించునో ఆనాడు ఆ రాజ్యము, ఆ సమాజము, ఆ వ్యక్తికూడను పతనమైపోతారు. అంతేకాక యెన్నో సంవత్సరములనుండి ఆర్జించిన నాగరికతకూడను పతనమైపోతుంది. 'నీతి లేకయున్న జాతి చెడును', అన్నారు. మానవ జాతికి నీతియే ప్రాణము. జీవితములో నీతియే సరైన ఆదర్శము. అట్టి నీతి యీనాడు కోల్పోటముచేతనే మానవజాతి క్షీణించుచూవున్నది.

'నీతి లేనివాడు కోతికంటె పాడు' అని సామెత. కారణమేమనగా, కోతి అనేక విధములుగా ఆదర్శము నిరూపిస్తూ వుండాది. ఒకానొక సమయములోపల డార్విన్ చెప్పాడు. 'నేను లేక నీవు లేవు' అన్నాడు. యిది సత్యమో అసత్యమో గుర్తించుట అసాధ్యము. కాని, కోతి చెప్పే ఒక మాట మాత్రము పరమసత్యము. 'ఓ మానవుడా! నేను లేక నీవులేవు', అని ఛాలెంజి చేసింది కోతి. 'నేనే నీ మనస్సు ఆకారము ధరించి వున్నాను', అంది. 'తినిపించేది, నడిపించేది నేనే. జగత్తులోపల మురిపించేది నేనే. అందుకోసమే మానవుని మనస్సుకు కోతిమనస్సుయని పేరు పెట్టుకున్నారు. నీకంటే నేను వుత్తమురాలను!' అంది. "నేను రామసేవ చేశాను. మీరు కామసేవ చేస్తున్నారు. నేను రామునికి దాసుడు కావటముచేత కాముడు నాకు దాసుడు అయ్యాడు. కాముడు రాక్షసుడు. రాముడు దేవుడు. లోకములో చెట్టు, పిట్ట, పడవ, పక్షి, ఉడుత మేమంతా రామసేవలో పాల్గొన్నాము. రామునికి సేవ చేశాము. రాక్షసరాజైన రావణుడు యేమి చేశాడు? సీతమ్మను కొన్ని కష్టములకు గురిచేశాడు. తద్వారా రాముని అవస్థల పాలు గావించాడు. దేవునే బాధలు పెట్టేవాడు మానవులను బాధింపడా? అట్టి కామదాసుడైన దానవుడు రామదాసైన కోతికంటే అధికమెట్లా అవుతాడు? ఓ మానవుడా! నాకైనా ఒక్క సమయములో స్థిరత్వము వున్నది. మీ మానవులకు క్షణమైన స్థిరత్వము లేదు. కనుకనే monkey is better than man

sri sathyasaivachanamrutam

అన్నారు" అని చెప్పింది. మానవత లేనివాడు కోతికంటే హీనమనే సత్యాన్ని చక్కగా నిరూపిస్తూ వచ్చింది కోతి. ఏనాడు మనము నైతిక విలువలను అభివృద్ధి పరచుకొని మానవత్వాన్ని నిలబెట్టుకొని దైవత్వాన్ని వ్యక్తము చేసుకుందుమో ఆనాడే నిజమైన మానవత్వాన్ని వ్యక్తీకరించిన వారమవుతాము.

**భారతీయ సంస్కృతి లోని విలువలను గుర్తించినప్పుడే మానవత్వము సార్థకత్వము చెందుతుంది**

'వ్యక్తి' అనగా సంస్కృత పదమునందు 'పౌరుషము' అని పేరు. పౌరుషమనగా, వ్యక్తి అనగా సామాన్యమైన పదములుగా మనము భావిస్తున్నాము. కాదు, కాదు. పౌరుషముగల పురుషునికి మాత్రమే 'వ్యక్తి' అనే పదము సార్థక నామము. నీతి నిజాయితీలతోకూడి ప్రవర్తించినటువంటి, సత్ప్రవర్తనతోకూడిన మానవత్వమునకే వ్యక్తిత్వమనేది సార్థకనామము. దీనినే యింగ్లీషు పదములోపల Person అని చెబుతూ వచ్చారు. ఈ person అనే పదము రోమను భాషలోని 'persona' అనే పదమునుండి వచ్చినది. persona అనగా దైవాంశమని అర్థము. గుప్తమై, అవ్యక్తమై తనయందు వుండిన దైవత్వాన్ని యే వ్యక్తి వ్యక్తము చేసుకొనునో అట్టి వానికే వ్యక్తి అని సార్థకనామము. ప్రతి మానవునియందుకూడను దైవాంశ వున్నది. కాని అందరు దీనిని వ్యక్తము గావించుకోటం లేదు. అందరూ దీనిని అర్థము చేసుకోటం లేదు. అట్టి అర్థము చేసుకొనలేని, వ్యక్తము గావించుకోలేని మానవునికి 'వ్యక్తి' అని పేరు పెట్టుకోటం నిరర్థకము. తనయందు గోప్యముగా, గుప్తముగా వుండిన దివ్యత్వాన్ని యే మానవుడు వ్యక్తీకరింప జేసుకొనునో, అట్టివాడే నిజమైన వ్యక్తి. ఇది కేవలము నీతి నిజాయతీలతోనే మనకు లభిస్తుంది. సత్ప్రవర్తనయొక్క ఆదర్శముతోనే యిది ప్రకాశిస్తుంది. సత్ప్రవర్తన, సదాలోచనలు, సచ్చింతనలు లేక దివ్యత్వమనే వ్యక్తిత్వము యేనాటికి మనకు ప్రకటితము కాదు. ఏకత్వమనే నిత్యత్వాన్ని మనము అనుభవించుటకు ప్రయత్నించాలి. సమత్వము అనగా మనందరము ఒక గూటిలోని గువ్వలమనే భావముగా తీసుకోవాలి. ఒక్క తీగలోని పువ్వులమని చింతించాలి. ఒక్క తల్లి పిల్లలమని భావించాలి. ఒక్క జాతి పౌరులమని

srisathyasaivachanamrutam

భావించాలి. **ఒక్క గూటిలోని గువ్వలం**

**ఒక్క తీగలోని పువ్వులం**
**ఒకే తల్లి పిల్లలం**
**ఒకే జాతి పౌరులం**

అదే భారతీయుల గౌరవమని మనము విశ్వసించాలి. సర్వజనహితమే భారతీయుల మతము. సర్వజనహితమే భారతీయ సంస్కృతి. ఇట్టి సంస్కృతియొక్క విలువలను మనము యేనాడు గుర్తింతుమో ఆనాడే మానవత్వముకూడను సార్థకతనొందుతుంది.

**మన సంకల్పముల ప్రతిఫలములే మనము అనుభవించే సుఖదుఃఖములు**

మనుశాస్త్రమునందు కర్మఫలములనేవి పితికిన తక్షణమే పాలిచ్చే గోవువంటివి కాదన్నారు. చెడ్డవిషయాలుగాని, మంచివిషయాలుగాని, చెడుప్రవర్తనగాని, మంచిప్రవర్తనగాని భూమిలో నాటిన విత్తనములవంటివి అన్నారు. భూమిలో నాటిన తక్షణమే అది మొక్కగా రాదు. భూమిలో నాటిన విత్తనము తన దేహము ధ్వంసము చేసుకొని తదుపరి మొక్కగా బయలుదేరి తరువాత వృక్షముగా వచ్చి ఆ తరువాతనే ఫలమునందిస్తున్నది. కనుక, మనము చెడుకార్యము చేసిన తక్షణమే దీని ఫలితము రాలేదే అని నిర్లక్ష్యముగా, హాస్యాస్పదముగా ఉండరాదు. కొంతకాలమును తీసుకుంటుంది. తదుపరి, మంచిచెడ్డలయొక్క ఫలితము మానవునకు తప్పక లభిస్తుంది. మనసులోని భావము మంచిదైనప్పుడు దానియొక్క ఫలితముకూడను మంచిదిగానే వుంటుంది. మనసులోని భావము చెడ్డదైనప్పుడు ఫలితమునందుకూడను మాలిన్యమేర్పడుతుంది. కనుక, మన సంకల్పములయొక్క ప్రతిఫలములే మనము అనుభవించే సుఖదుఃఖములు.

**ప్రతిదేశములోను యాజమాన్య పద్ధతులు ఆదేశ సంస్కృతి మరియు విలువలపై ఆధారపడి ఉంటాయి**

ప్రపంచమునందు ఏ దేశమైనప్పటికి, ఆ దేశముయొక్క సంస్కృతి మరియు విలువలు దేశకాలపాత్రల ప్రభావమును అనుసరించియే వుంటాయి. ఒక దేశముయొక్క సంస్కృతి,

sri sathyasai vachanamrutam

ఒక దేశముయొక్క విలువ, ఒక దేశముయొక్క పద్ధతులు మరొక దేశమునకు భిన్నముగా వుంటుంటాయి. అదే విధముగ అమెరికాయొక్క మేనేజ్‌మెంటు ఒక పద్ధతిలో నడుస్తూ వుంటుంది. జపాన్‌యొక్క మేనేజ్‌మెంటు మరొక పద్ధతిలో నడుస్తూ వుంటుంది. ఇంగ్లాండుయొక్క మేనేజ్‌మెంటు యింకొక పద్ధతిలో నడుస్తుంది. ఒక చిన్న ఉదాహరణము. అమెరికాయొక్క మేనేజ్‌మెంటు కేవలము ఒక అహంకారముతో లేక అనుకరణతో కూడి వుండవచ్చు. అట్టి అమెరికా మేనేజ్‌మెంటును భారతదేశమందు ప్రవేశపెట్టడానికి యేమాత్రము అవకాశము వుండదు. ఆ దేశమునందు వస్తువుల ఉత్పత్తిని అధికముగా ఆశిస్తుంటారు. అంతేకాదు. సంఖ్యాపరముగా ఎక్కువ వస్తువులు అమ్మబడుతూ అందులో ఎక్కువ ధనమును ఆర్జించాలని వారి ఆశ. ఆ దేశములోని మేనేజ్‌మెంటు విధానమును బట్టి వర్కర్సును నిర్దాక్షిణ్యముగా శిక్షిస్తుంటారు. వారికి అవసరమైనప్పుడు వర్కర్సును తీసుకోటము, అవసరము లేనప్పుడు నిర్దాక్షిణ్యముగా వెనుకకు పంపటము (hire and fire policy) అమెరికా మేనేజ్‌మెంటులో ప్రధానమైన అంశము. అక్కడ మానవతా విలువలనేవి శూన్యము. కేవలము మనీవాల్యూనే వారు లక్ష్యము నందుంచుకుంటారు. భారతీయులు అమెరికన్ మేనేజ్‌మెంటును అనుసరించటముచేత కొన్ని విధములైన ఫలితములు సాధించలేకపోతున్నారు. భారతదేశములో అమెరికన్ మేనేజ్‌మెంటు పద్ధతులు యెక్కువ success కాలేదు. ఇంక జపాన్ వుంటుండాది. ఈ జపాన్‌యొక్క సంస్కృతిని అనుసరించి కొంతవరకు వర్కర్సుకు స్వాతంత్ర్యము యిస్తూ వుంటారు. ఈ విధానములో మేనేజర్సుకు, వర్కర్సుకు సంబంధబాంధవ్యము చాలా గాఢముగా వుంటుంది. కనుకనే జపాన్‌లోపల strikes అనేవి యెక్కడా కన్పించవు. ఇంతేకాక వారు ఎప్పుడో ఒకతూరి strike చేద్దామని అనుకుంటే ఆనాడు వారు తమ workshop నుగాని, factory నిగాని మూతపడేటట్లు చేయరు. అందుకు విరుద్ధముగా ఆనాడు వారు అధికముగా పని చేస్తారు. ఇది వాళ్ల పద్ధతి. ఇలాంటి సహనభావము వుండటంచేతనే జపాన్‌యొక్క మేనేజ్‌మెంటు కొంతవరకు అభివృద్ధి చెందుతూ వుంటున్నాది. ఈ యాజమాన్య పద్ధతులు కేవలము ఆయా దేశములకు మాత్రమే అన్వయమవుతూ వుంటాయి.

ప్రతీ దేశమునందుకూడను Statistics, Accounts, Management, Production

sri sathyasai vahamrutam

యివి సమానంగానే వుంటుంటాయి. అమెరికా దేశము, జపాన్ దేశము, యింగ్లాండు దేశము అన్నింటియందును యీ నాలుగుకూడను సమానముగా వుంటుంటాయి. కాని, ఆ దేశములోపల ఆ దేశముయొక్క సంస్కృతికి, విలువలకు ఎక్కువ అవకాశము అందించటంలేదు. కానీ మన Institute లో Management Philosophy కి ప్రత్యేకమైన కొన్ని విలువలను, సంస్కృతులను జోడించి అభివృద్ధి గావించటానికి ప్రయత్నిస్తున్నాము. ఇందులో ప్రధానమైనవి Indian Ethos and Values, Indian Economic Development మరియు Personnel Management. యింతే కాదు, Organisation Behaviour కూడా వుంటుండాది. Personnel development వుంటుండాది. Human values కూడా వుంటుండాది. మన Institute లో MBA లోపల ప్రత్యేకముగా ప్రతి semester నందుకూడను Human values, Indian Ethos and Values యివి ప్రత్యేకమైన రీతిగా వుంటుంటాయి. ఇంతేకాకుండా Computer ని ఏ విధముగా వినియోగించుకోవాలనే విధానాన్నికూడా తెల్పుతుంది. Practical Management కూడను యిందులో ప్రధానముగా వుంటుండాది. మనము యీ Indian Ethos and Values అనే అంశమును ప్రధానంగా లక్ష్యములో వుంచుకోవాలి. ఇంతవరకు భారతదేశములో ప్రారంభించిన MBA కోర్సులలో ఈ పాఠ్యాంశములు ఎక్కడా లేవు. యాజమాన్యము మరియు వర్కర్సు ఒక తల్లి బిడ్డలవలే అన్యోన్యముగా కలిసిమెలిసి సహనభావముతో జీవించటానికి మన Indian Ethos సబ్జక్టు బాగా దోహదం చేస్తుంది. ఇవికాక, మరొక ముఖ్యమైన అంశము, ప్రార్థన, prayer. అదే సామూహిక prayer, silent prayer. ఫ్యాక్టరీ ప్రారంభమయ్యే ముందుగా ప్రతి ఒక్కరుకూడను నిల్చుని silent గా ప్రార్థన చేసినప్పుడు, ఆనాడు వారి హృదయం ఎంతో పవిత్రముగాను, వుల్లాసముగాను ఉంటుంది. యింటియందు, వంటియందు, ఫ్యాక్టరీయందు ఆనందాన్ని అనుభవించటానికి అవకాశము వుంటుంది.

యీనాడు ప్రపంచములో వున్న MBA కోర్సులు అన్నీ ఒక అనుకరణగా నిర్వహింపబడుతున్నాయి. అయితే, ఏ దేశముయొక్క Management ను మరొక దేశము యిమిటేషన్ చేయటంలో అర్థము లేదు. ఈ విధముగా చేయటముచేత అధిక ధన వ్యయము, కాల వ్యర్థము, కొన్ని విధములైన కలహములకుకూడను కారణమవుతున్నది.



sri sathyasai vacharamrutam

యిమిటేషన్ అనేది హ్యూమన్ వ్యాల్యూ కాదు. Creation is human value. తనయొక్క దివ్యమైన భావములచేతను, నవ్యమైన గుణములచేతను తనయందున్న సమతత్త్వమును, పవిత్రతను అభివృద్ధి పరచుకోవాలి. ఒక్కొక్క దేశముయొక్క పద్ధతులు ఒక్కొక్కటిగా వుండవచ్చును. ఆ దేశమునకు అది మంచిదిగా వుండవచ్చును. కానీ వారు మంచిదని చెప్పారని మనము blind గా అనుకరించకూడదు. దేశకాలపాత్రలయొక్క ప్రభావాలనుకూడా మనము గుర్తించుకోవాలి. మన సంస్కృతి వేరు. మన విలువలు వేరు. వారి సంస్కృతి వేరు, వారి విలువలు వేరు. భిన్నభిన్న సంస్కృతులు మరియు విలువలు యేమాత్రము కలియుటకు వీలు కాదు. ఒకవేళ ఆ విధంగా కలయిక చేరెనా కొంతవరకు భ్రష్టుపట్టటానికి అవకాశము వుంటుండాది.

**బిజినేస్ మేనేజ్‌మెంటులో విదేశీ పద్ధతులను అనుకరించటం సరికాదు**

ఒక చిన్న కథ. ఒక గ్రామములోపల పెద్ద బజారునందు ఒక వర్తకుడు పండ్ల అంగడి పెట్టుకొని దానిపైన ఒక బోర్డు రాసి పెట్టాడు. 'ఇచ్చట మంచిపండ్లు అమ్మబడును' అని వ్రాసుకున్నాడు. అందరూ బోర్డు చూస్తూ వచ్చారు. అందులో ఒక తెలివైన వ్యక్తి ఆ బోర్డు దగ్గరకు వచ్చి 'ఎవరిదయా యీ బోర్డు? ఎవరు వ్రాసారు?' అని ప్రశ్నించాడు. 'అర్థములేని పదములుగా వుంటున్నాయే యిందులో', అన్నాడు. 'ఇచ్చట' అని ఎందుకు వ్రాయాలి ఈ పదము తీసివేయమన్నాడు. ఈ షాపువాడు కొంచెము యోచించాడు. 'అవును నిజమే', అన్నాడు. ఒక పెయింటరును పిలిపించి దానిని తుడిపించేశాడు. ఇంక మిగిలినది యేది? 'మంచి పండ్లు అమ్మ బడును', అని మూడు పదములు మాత్రమే వున్నాయి. రెండవరోజు యింకెవరో వచ్చి 'ఏమిటయ్యా, కొనేవారిని అవమానము చేయటానికా యీ బోర్డు పెట్టుకున్నారు? మంచి, చెడ్డ కొనేవారికి తెలీదా. నువ్వు ఎందుకు మంచి పండ్లు అని రాయాలి? యీ మంచిని తీసివేయ'మన్నాడు. 'మంచీ, చెడ్డా తేడా వారే select చేసుకుంటారు. నీవు మంచి అని ఎందుకు రాయాలి? నీవు కొనేవారిని కించపరుస్తున్నావు. దానిని తీసివేయ'మన్నాడు. సరే! యీ పండ్లు అమ్మేవాడు యోచన చేసుకున్నాడు. నిజమే, పెయింటరును పిలిచి యీ పదము తీసేయించాడు. ఇంక 'పండ్లు అమ్మబడును' అని రెండు

sri sathyasai vachanamrutam

పదములున్నాయి. మూడవరోజు యింకొకడు వచ్చాడు. ఇవి పండ్లు అని అందరికి తెలుసు. కనుక 'పండ్లు' అనే పదము తీసివేయమన్నాడు. ఈ అంగడివాడు చక్కగా యోచించాడు. సరే పెయింటరును పిలిపించాడు. దానినికూడా తుడిపించేశాడు. ఇంక వుండేది 'అమ్మబడును' అనే ఒక్క పదము మాత్రమే! ఇంకొకడు వచ్చాడు. 'ఏమిటయ్యా యీ బోర్డు? అమ్ముతున్నారా? ఏమిటి అమ్మబడును, దేనిని అమ్ముతున్నారు? అర్థము లేని బోర్డు పెట్టుకున్నావా, తీసివేయి', అన్నాడు. అప్పుడు దానినికూడ తీసి లోపల పెట్టాడు. నాల్గవ దినము ఆ పెయింటరు వచ్చి 'సార్! యీ పేర్లంతా తుడిచి వేసినందుకు బిల్లు యింతైంది', అన్నాడు. అప్పుడు అంగడివాడు అనుకుంటున్నాడుట! 'నేను పిచ్చిపిచ్చిగా వాళ్లను వీళ్లను అనుసరించటంచేత నా బోర్డు పోయింది. నా పేరు పోయింది. నాకు నష్టము కలిగింది. ఇదా నేను చేసిన విషయము', అని వాడు విచారించాడుట! యీనాడు మన బిజినెస్ మేనేజ్మెంటుకూడా యిట్లా వుంటుందాది. ఒక్కొక్క దేశము వాళ్లు ఒక్కొక్కటి చెప్పటంవలన ఒక్కొక్కటి తీసేసి తరువాత అన్నీ తీసివేసి మన భారతదేశము దివాలా యెత్తటానికి ప్రయత్నించింది. మన సంస్కృతిని మనము మరచిపోతున్నాము. బయటదాన్ని అనుకరించటం imitation. ఈ imitation వల్ల మన దేశము అన్ని విధముల దురవస్థలపాలు చేసుకుంటున్నాము.

ప్రాచీన కాలమునందు గ్రీసుదేశములోపల Spartan అనే రాజు తన రాజ్యాంగమును చక్కగా రూపొందించుకోటానికి ప్రయత్నించాడు. అతనికి ఒక గురువు వుండేవాడు. ఆ గురువుయొక్క ఆజ్ఞను శిరసావహించి ఏఏ దేశములలో ఏఏ విధమైన నిబంధనలచేత రాజ్యమును పాలిస్తున్నారో చూచుకొని రావాలని permission తీసుకున్నాడు. దేశాలన్నీ తిరిగాడు. కట్టకడపటికి భారతదేశమునకు వచ్చాడు. ఆనాడు భారతదేశములోవున్న విద్యావిధానాన్ని చక్కగా అధ్యయనం చేశాడు. ఆనాడు భారతదేశములో నేడు ఉన్నట్లుగా పెద్ద పెద్ద యూనివర్సిటీలు లేవు. ఆనాడు అరణ్యములలోని ఆశ్రమాలలో కొందరు మహనీయులు కొంతమంది పిల్లలను పెట్టుకొని వారికి విద్య బోధిస్తూ ఉండేవారు. అవే పెద్ద University లుగా ఉండేవి. ఒక్కొక్క ఋషియొక్క గృహము ఒక University గా రూపొంది ఉండేది. పెద్ద పెద్ద భవనములు, పెద్ద పెద్ద ఆడిటోరియములు మొదలైన అనుకూలములు

sri sathyasai vahini amrutam

వారికి యేమాత్రము లేవు. ఒక్కొక్క సమయములో చెట్లక్రిందనే పిల్లలను కూర్చోపెట్టుకొని వాళ్లకు పాఠములు నేర్పేవారు. అటువంటి గురుకులములలో విద్యార్థులు ఎన్ని కష్టములకైనా, ఎన్ని నష్టములకైనా, ఎన్ని అనానుకూలములకైనా సహించి, గురువువద్ద విద్యాభ్యాసము చేసేవారు. ఆనాడు టీచర్సునుండిగానీ, పిల్లలనుండిగానీ యే విధమైన కంప్లైట్సు ఉండేవికావు. ఈ విద్యావిధానములో గురువుల దగ్గర శిష్యులు యే విధముగా మెలగుతున్నారు, గురువులు శిష్యులకు యే విధముగా శిక్షణ యిస్తున్నారు, యీ రెండింటిని గుర్తించాడు, ఆ రాజు. కొంతమంది విద్యార్థులను తాను యింటర్వ్యూకూడా చేశాడు. ఈ విధంగా ఆనాటి విద్యావిధానమును కూలంకషంగా అధ్యయనం చేశాడు. భారతీయులయొక్క విద్య కేవలము నీతినిజాయతీలతోకూడిన విద్య అని తాను అర్థము చేసుకున్నాడు. ఇందులో కొన్ని విధములైన వేదాంత గ్రంథములను తాను స్వయంగా పఠించాడు. ఉపనిషత్తులందు సత్యమే విజయాన్ని సాధిస్తుందని వుంది. భగవద్గీతయందు 'సత్యాన్నాస్తి పరోధర్మః' అని వున్నది. సర్వ ధర్మములకు సత్యమే ఒక పునాది అని నిర్ణయించుకున్నాడు. 'సత్యవంతుడు మాత్రమే యీ జగత్తును ఉన్నతస్థితికి తేగలడు' అని బైబిలువాక్యము చూచాడు. 'బోధ, పని యీ రెండింటియొక్క చేరికచేతనే మానవుడు దివ్యమైన తత్త్వాన్ని అనుభవిస్తాడు. సత్యమైన మాటచేత, సత్ప్రవర్తనచేత నిజమైన మానవుడు కాగలడ'నే సత్యాన్ని ఖురాన్‌లో చూచాడు. 'స్త్రీ కాని, పురుషుడు కాని కర్మ సిద్ధాంతమునందు విశ్వాసమును అభివృద్ధి పరచుకోవాలి. కర్మయే నా కర్తవ్యమనే విశ్వాసాన్ని అభివృద్ధి పరచుకోవాలి. కనుక, కర్మను కర్తవ్యముగా భావించినవాడే మానవుడు' అనేది Buddist Philosophy'. దానినికూడా తెరచి చూచాడు. చివరకు అన్నింటియందు వున్న సమన్వయాన్ని తాను గుర్తించటానికి ప్రయత్నించాడు. 'భారతీయులయొక్క నీతి, నిజాయతీలోనే సర్వమతసమన్వయము యిమిడి వుంద'ని తాను అర్థము చేసుకున్నాడు. కనుక, భారతీయులయొక్క నైతిక విలువలను గ్రీసులోపల ప్రారంభించాలి అని ప్రయత్నము చేశాడు. భారతదేశమునకు గురువాజ్ఞను శిరసావహించి రావటముచేత భగవద్గీత, గంగాజలము, భారతదేశముయొక్క మట్టిని, మహాభారతమును తనవెంట తీసుకొని వెళ్లాడు. ఇంతటి గొప్ప సంస్కృతి భారతదేశమునందున్నది అనే

sri sathyasai vahamrutam

విషయము గుర్తించాడు. ఇట్టి పవిత్రమైనవంతా భారతదేశమందు వుండినప్పటికి, దీపమునకు క్రింద నీడవుండినట్టుగా భారతీయులు యీ చీకటిలో పడి పరులయొక్క సంస్కృతి గొప్పదని భ్రమించి దానిని ఆశ్రయిస్తూ వచ్చారు. ఆ విధంగా ఆశ్రయించటముచేతనే భారతీయుల బ్రతుకు యీ విధముగా తెల్లవారి పోతున్నది.

**అవినీతి, అక్రమ మార్గములో సంపాదించిన ధనము శాశ్వతముకాదు**

ఈ బిజినెస్ మేనేజ్‌మెంటు కోర్సులో భారతీయ ethos and values అనే సబ్జక్టు చాలా అవసరమైనది. నీతినిజాయతీలతో మనము సాధించిన ధనముగాని, కీర్తిగాని, గౌరవముగానీ, యశస్సుగానీ శాశ్వతముగా నిలుస్తుంది. ఈనాడు అవినీతి మార్గములో, అసత్యమార్గములో, అక్రమమార్గములో సంపాయిస్తున్నారు, ధనము. అది ఏనాటికి, సత్యమార్గమును నిరూపించలేదు. సుఖశాంతులను అందించలేదు. గౌరవ మర్యాదలను అందించలేదు. ఈనాడు Business Management లో 'communication' కు యెక్కువ ప్రాధాన్యత వుంటున్నాది. అయితే యీ communication ఎంతవరకో అంతవరకే వుండాలి. మితిమీరిపోవటంచేత దేశము తన స్థితిగతులను కోల్పోతున్నది. ఒక చిన్న ఉదాహరణము. ఈనాడు communication వ్యవస్థ చాలా చురుకుగా వుండటముచేత బెంగుళూరులో యేదైనా చిన్న అల్లరి జరిగిందనుకోండి, ఒక factory లోపల ఒక strike జరిగింది అనుకోండి. Next minute లో యీ సమాచారము Delhi, Punjab యీ అన్ని ప్రదేశములకు చేరిపోతుంది. ఒక్క దినములోపలనే ప్రపంచము అంతాకూడను ప్రాకిపోతుంది. దేశమంతా ఆ strike కు సానుభూతిగా అల్లర్లు ప్రారంభమవుతాయి. కనుక, యీ communication అనేదానిద్వారా మంచికంటే చెడ్డయే ఎక్కువ జరుగుతున్నాది. ఇందులో మంచి చాలా తక్కువగా వుంది. మన భారతదేశములో ముఖ్యంగా Man management కు అధిక ప్రాధాన్యత యివ్వాలి.

**మనస్సు, మాట, పని ఒక్కటికావాలి**

Man management సరిగా వున్నప్పుడే ఇవన్నీ సక్రమముగా జరిగిపోతాయి. దీనికి సరైన మానవత్వాన్ని పెంచుకోవాలి మనము. The proper study of mankind is man

sri sathyasai vachanamrutam

అన్నారు. ఏమిటి యీ proper study-thoughts, words, deeds మనస్సు, మాట, పని, ఒక్కటి కావాలి. ఇదే మానవునియొక్క ప్రధానమైన గుణము. ఈనాడు మానవుడు ఆశించవలసినది యిదియే! గోడలపైన వ్రాసే రాతలు, ప్లాట్‌ఫారంపైన కూసే కూతలు, పేపర్లో వేసే వ్యాసాలు, యివికాదు మనకు కావలసినవి. నీతినిజాయతీలు కలిగిన నేతలు మనకు కావాలి. ఇదే మేనేజ్‌మెంటుకు సరైన విలువ. ఈ మేనేజ్‌మెంటు వాల్యూ అనేది మన సంస్కృతిపైనే ఆధారపడాలి. మన విలువలనే ఆధారంగా చేసుకోవాలి. మన విలువలను, మన సంస్కృతిని విచ్ఛినం చేసుకొని ఏదో ఒకదానిని మనము అనుసరిస్తున్నామంటే యిది ఏనాటికైనా ప్రమాదమే! యీనాడు Production management తో పాటు, Finance management, దానితో బాటు Individual management కూడను అభివృద్ధి గావించుకోవాలి. Indian Ethos and Values అనేది ఒక పాత్రవంటిది. ఇప్పుడు నేను చెప్పిన మేనేజ్‌మెంటులంతాకూడను పదార్థముల వంటివి. పదార్థములు ఎన్ని produce చేసి యేమి ప్రయోజనము? ఎక్కువ production కావాలని ఆశిస్తున్నాము. కానీ దాని విలువ యీ సమాజములో వున్నదా? దాని వినియోగము యీ సమాజములో వున్నదా? దానితో వుపయోగము వున్నదా? ఈ విషయముకూడ మనము గుర్తించాలి. పాత్రను చిన్నదిగా పెట్టుకొని దండిగా నీరు కావాలనుకుంటే ఎట్లా చిక్కుతుంది? నీకు ఎక్కువ water కావాలనుకుంటే నీ పాత్రను పెద్దదిగా చేసుకో. పాత్రను చిన్నదిగా పెట్టుకొని ఎక్కువగా water కావాలంటే అది సాధ్యము కాదు. ఒక వేళ లభించినా అది క్రింద పడిపోతుంది. నిలువదు. యీనాడు మనము మన పాత్రను అభివృద్ధి గావించుకోవాలి. హృదయము విశాలము చేసుకోవాలి. దైవత్వమును మరచకుండ పెట్టుకోవాలి. ఇదే మానవత్వమునకు సరైన ఆధారము.

**నైతిక, ఆధ్యాత్మిక విలువలు రెండూ చేరినప్పుడే మానవ జీవితము పరిపూర్ణమవుతుంది**

ప్రతి పని ప్రారంభించేముందు ప్రార్థన అనేది తప్పనిసరిగా వుంటుండాలి. ఈ ప్రార్థన హృదయమును పరిశుద్ధము చేస్తుంది. దుర్భావములు దూరము చేస్తుంది. ఆనందాన్ని పెంపొదిస్తుంది. మన శరీరమునకు బలాన్నికూడను చేకూరుస్తుంది. అప్పుడే మనము అన్ని

sri sathyasai vahini

రంగములలోను కార్యసాఫల్యమును సాధించగలము. నిరుత్సాహముతోవున్న మానవుడు, బలహీనుడైన మానవుడు ఎట్టి కార్యాన్నికూడను సాధించలేడు. మానవునకు రెండే రెండు నేత్రములు, అవే నీతి, నిజాయతి. ఈ రెండింటిని ఏకము చెయ్యాలి. రెండు కన్నులు చేరి ఒక వస్తువును చూస్తున్నాయి. నైతిక మార్గము వుండినంత మాత్రమున ప్రయోజనములేదు. నైతికముతోపాటు ఆధ్యాత్మికముకూడా వుండాలి. ఇప్పుడు యీ మైక్ చాలా condition లోనే వుంటుండాది. అలా condition లో వుండినంత మాత్రమున ప్రయోజనము లేదు. దీనిలో current ప్రవహించాలి. లేకపోతే ప్రయోజనము వుండదు. current వుంది కానీ mike condition లో లేదు. అప్పుడు నేను మాట్లాడికూడను మీకేమి వినిపించదు. కనుక, యీ నెగిటివ్ ఆ పోజిటివ్ రెండుకూడను సరైన స్థితిలో వుంటుండాలి. నైతిక విలువ నెగిటివ్, ఆధ్యాత్మిక విలువ పోజిటివ్. ఈ రెండూ చేరినప్పుడే మన జీవితము పూర్ణవంతమవుతుంది.

ఈనాడు ప్రపంచములో ఎన్నోరకాల MBA కోర్సులంతాకూడను స్థాపించారు. వీటి అర్థాలుకూడను వేరు వేరుగా వుంటున్నాయి. మన సిలబస్‌కు, మన విలువలకు, మన సంస్కృతికి MBA (Master Business Administration) సరైన పేరుకాదు. ఇంకా కొన్నికొన్ని చోట్ల MMS అనగా Master of Management Science అని ఈ కోర్సును వ్యవహరిస్తున్నారు. కాని యిది కూడను సరైనదికాదు. మనకోర్సుకు MMM అనగా Master of Man Management అనేది సరియైనదిగా వుంటుంది. యీ జగత్తులో యే విధమైన వ్యాపారము జరిగినప్పటికిని, ఏ విధమైన వస్తువులు వుత్పత్తి జరగవలసినప్పటికి, మనము sincere గా హృదయపూర్వకముగా నీతి నిజాయతీలతో వ్యవహరించి దీనిని అభివృద్ధి గావించినప్పుడు భారతదేశముయొక్క కీర్తి జగత్వ్యాప్తము అవుతుంది. విద్యార్థులు యీ విధంగా నడచుకొని సమాజమునకు తగినంత వుపకారము గావించాలని నేను ఆశిస్తూ నాయొక్క ప్రసంగాన్ని విరమిస్తున్నాను.

**మానవత్వము 'నేను'తో ప్రారంభమై 'మనం'తో ముగిసిపోవాలి**

ఈ Management విద్యార్థులందరూకూడను అప్పుడప్పుడు వారికేదైనా సందేహాలు వచ్చినప్పుడు నా వద్దకు వచ్చి తీర్చుకోవచ్చును. ప్రపంచములో ఎన్నో

sri sathyasai vachanamrutam

దేశములుంటున్నాయి. చిన్నవి పెద్దవి అంతా చేరితే యిందులో ప్రధానమైనవి 200 దేశములుంటున్నాయి. యీ దేశములకు సంబంధించి ఏ Management అయినా సరే నన్ను అడగండి, నేను చెపుతాను. వారమునకు ఒక్క పర్యాయమైనా sunday నాడు నన్ను కలిస్తే యీ మేనేజ్‌మెంటులో వచ్చే Human Values, ethos గురించి చక్కగా మీకు అరటిపండు వలిచి అందిచ్చినట్టు అందిచ్చి మీ సమస్యలను దూరము చేస్తాను. మీరు అనుకోవచ్చును, స్వామికి యీ Management విషయాలు ఎట్లా తెలుస్తాయి, స్వామి బోధించగలిగినది ఒక్క ఆధ్యాత్మికము కదా అని. స్వామికి సర్వము తెలుసు. Awareness is SAI. అన్నీ తెలిసినదే Divinity. 'యిన్ని లక్షలమంది యిన్ని దేశములవారు యిక్కడకు రావటానికి వారికేమి బుద్ధులు లేవా', అని కొందరు సందేహించవచ్చు వారందరికంటే ఎక్కువ తెలిసిన తత్త్వము ఇక్కడ ఉన్నది కనుకనే వారు యిక్కడ ప్రవేశిస్తున్నారు. నైతిక, భౌతిక, ధార్మిక, ఆధ్యాత్మిక, వైజ్ఞానిక, లౌకిక రంగములు అన్నింటియందుకూడను సరైన systems ను మనము అభివృద్ధి పరచుకోవాలి. మానవత్వము ఎప్పుడూ balance పైన ఆధారపడి వుంటుంది. ఆ balance వుండినప్పుడే వాడు perfect man అవుతాడు. ఈ balance అటూయిటూ యేమైనా అయిపోయిందా వాడు monkey కావచ్చును, యింకే విధముగానైనా కావచ్చును. ఈనాడు విద్యార్థులలో balance తప్పిపోటానికి కారణం యేమిటి? knowledge కావలిసినంత వుంటుండాది పిల్లలలో, knowledge కి తక్కువ లేదు. కాని వారిలో యీ balance లేకపోవటం జరుగుతోంది. ఈ balance ఎప్పుడు చక్కగా వుండటానికి వీలవుతుంది? మన knowledge ని skill చేస్తే balance సరిగా వుంటుంది. కాని యీ పిచ్చిపిల్లలు skill చేయటంలేదు. knowledge ని kill చేస్తున్నారు. దాని వలననే balance పోతుండాది. kill చేయటమంటే యేమిటి? పిచ్చి పిచ్చి మార్గములలో దానిని ప్రవేశపడుతున్నారు. Narrowpath లో ప్రయాణమవుతున్నారు. కేవలము స్వార్థము, స్వప్రయోజనము కోసమని knowledge ని వుపయోగపెడుతున్నారు. విశాలమైన భావముతో దేశముకోసమని, సమాజముకోసమని knowledge ని ఉపయోగపెట్టినప్పుడు చక్కని balance వుంటుండాది. నేను, నాది అనే అభిమానము క్రమేణా కొంచెం కొంచెం తగ్గించుకొని మనది, మనవారు అనే విశాలభావము మనము

అభివృద్ధి పరచుకోవాలి. మానవత్వము I తో start చేసి we లో end కావాలి. కానీ యెంతవరకు I,I, అనే పోతుంటే ఎలా? చివరకు ఈ స్వార్థములో మన eye కూడా పోతుంది. we అనేది లేకపోతే జీవితము వ్యర్థమైపోతుంది. కనుక, 'అందరూ ఒక్కటే' అనే సమత్వము మనము పెంచుకోవాలి. ఇదే సమసమాజము, నవ సమాజము అని అనిపించుకుంటుంది. ఒక ప్రక్కన నవ సమాజము అంటున్నారు, ఒకరినొకరు కొట్టుకుంటున్నారు. సమసమాజము అంటున్నారు, ఒకరినొకరు చంపుకుంటున్నారు. ఈ కొట్టుకోటం, చంపుకోటం సమసమాజమవుతుందా? కానేకాదు. ఒకరినొకరు రక్షించుకోవాలి. ఒకరికొకరు సహాయంగా వుండాలి. ఒకరికొకరు సానుభూతిని చూపాలి. ఇదే నిజమైన సమసమాజము. ఇటువంటి సమసమాజము ఒక్క ప్రార్థనద్వారా మాత్రమే అభివృద్ధి గాంచుతుంది.

**(తేదీ 21-08-1986న ఇన్‌స్టిట్యూట్ ఆడిటోరియంలో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam